క్లుప్తంగా

ఇసుకను డంప్ చేసి అమ్ముకుంటే చర్యలు



ఆస్పరిలో మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ

ఆస్పరి: చెరువులు, కుంటల్లో ఉన్న ఇసుకను డంప్ చేసి అమ్ముకుంటే చర్యలు తీసుకుంటామని ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ మస్తాన్ వలితో కలిసి మాట్లాడారు. ఇళ్లు నిర్మించుకునే వారు ఇసుకను తీసుకెళ్లవచ్చన్నారు. ఇసుకను అక్రమంగా అమ్ముకుంటే మాత్రం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవ్వరైనా ఇసుకను అక్రమంగా అమ్ముకుంటే టోల్ ఫ్రీ నంబర్: 18004256042కు సమాచారమివ్వాలని కోరారు.

చిన్నారులకు ఆర్థిక సాయం



మారెల్లలో చిన్నారులకు ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

తుగ్గలి : తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మిగిలిన మారెల్లకు చెందిన ముగ్గురు చిన్నారులను ఆదుకునేందుకు దాతలు స్పందిస్తున్నారు. మహర్షి వాల్మీకి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పులికొండ, బాలరంగయ్య, గుత్తి శ్రీధర్, ప్యాపిలి బంగి నాగరాజు, ప్రతాప్ రూ.21వేలు, ప్యాపిలి వెంకటరమణచారి రూ.10వేలు, దేనకొండ రిటైర్డ్ హెచ్ఎం ఉచ్చూరప్ప, విజయరాజు రూ.20వేలు, మారెల్ల గడ్డం లాలప్ప రూ.10వేలు కోటకొండ జ్యోతి స్కూల్, రాతన రాజు, పెద్ద దోర్నాల పుల్లయ్య కలిసి రూ.3,500 చిన్నారులకు అందజేశారు. వీఆర్ఏ అంజి పాల్గొన్నారు.

వ్యవసాయ పద్ధతులపై అవగాహన



నర్సరీలో మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న విద్యార్థినులు

ఆలూరు: పాఠశాల దశ నుంచి వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని హార్టికల్చర్ అధికారిణి ఇందిర విద్యార్థినులకు సూచించారు. ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా కస్తూర్బా పాఠశాలలో పది, ఇంటర్ చదువుతున్న విద్యార్థినులు ఎస్ఓ ప్రియాంక ఆధ్వర్యంలో స్థానిక వైష్ణవి నర్సరీని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీలో పెంచుతున్న పెంచుతున్న జామ,నిమ్మ, అరటి, చింత,టమాట,ఉల్లి, మామిడి వేప తదితర మొక్కల గురించి హెచ్ఓ వివరించారు.

శాంతించిన వేదావతి



మార్లమడికి వద్ద వేదావతి నదిలో తగ్గిన వరద ఉధృతి

హొళగుంద: ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులోని మార్లమడికి వద్ద ఉన్న వేదావతి నది శాంతించడంతో గురువారం ఇరు రాష్ట్రాల మధ్య రాకపోకలు పునః ప్రారంభమయ్యాయి. నదీ పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు బుధవారం నదిలో పెద్ద ఎత్తున వరద నీరు వంతెనపై ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. నదికి భారీ ఎత్తున వరద నీరు రావడంతో నది పరిసారాల్లో సాగైన వరి, మిరప, పత్తి, వేరుశనగ పంటలు నీట మునిగాయి.

పంటలను కాపాడుకోవాలి



పత్తిపంటను పరిశీలిస్తున్న ఏఓ రవి

మద్దికెర : మండలంలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయని, రైతులు వ్యవసాయాధికారులు సూచనల మేరకు యాజమాన్య పద్ధతులు పాటించి పంటలను కాపాడుకోవాలని ఏఓ రవి తెలిపారు. గురువారం మద్దికెర పరిసరాలలో పత్తి, పొగాకు, పప్పుశనగ పంటలను పరిశీలించారు. పొగాకు పంటలో ఇనుప ధాతువు లోపించిందని, నివారణకు 5 గ్రాములు అన్నబేది, 1 గ్రాము నిమ్మ ఉప్పు కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే టమాట పంటలో అధిక వర్షాలకు వేరుకుళ్ళు, మచ్చ తెగులు ఆశించే అవకాశాలు ఉన్నాయని, నివారణకు కాపర్‌ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఉల్లిగడ్డకు కుళ్ల తెగులు ఆశిస్తోందని, నివారణకు సాస్ 2 గ్రాములు లేదా కాపర్ ఆక్సోక్లోరైడ్ 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పంటలపై పిచికారీ చేయాలని చెప్పారు.

ఈ- కేవైసీ ఇంకెప్పుడు?

వ్యవసాయంలో అన్నదాతలకు అండగా నిలవాలని ప్రభుత్వం పంటల బీమా, సంక్షేమ పథకాల అమలు చేస్తుంది. అయితే ఇవన్నీ వర్తించాలంటే సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించడంతో పాటు ఈ-కేవైసీ కూడా చేయించాల్సి ఉంది. అయితే కొందరు అధికారుల నిర్లక్ష్యం, రైతన్నల నిర్లిప్తత కారణంగా పలువురు అన్నదాతలు ఈ-క్రాప్ నమోదు చేయించుకున్నప్పటికీ ఈ-కేవైసీ చేయించుకోలేదు. దీంతో ఏదైనా ప్రకృతి విపత్తులతో పంట నష్టపోతే వారికి పంటల బీమా అందకుండా పోయే అవకాశముంది.



పత్తికొండ మండలం చక్రాళ్లలో ఈ-పంట నమోదు చేస్తున్న వీహెచ్ఏ సునయన (ఫైల్)

- ఖరీఫ్‌నకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులు 72,939
- ఈ-కేవైసీ చేయించుకున్న రైతులు 68,503
- ఈ-కేవైసీకి 4,436 మంది రైతులు దూరం

పత్తికొండ(తుగ్గలి): పంటల సాగులో ఈ- క్రాప్ నమోదు చాలా ప్రధానమైనది. పంటను విక్రయించుకోవాలన్నా, ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగితే పంటల బీమా పొందాలన్నా ఈ- క్రాప్ తప్పనిసరి. ఈ - క్రాప్ నమోదు చేసుకున్న ప్రతి రైతు ఈ-కేవైసీ కూడా చేయించుకోవాలి. ఈ- క్రాప్, ఈ-కేవైసీ చేయించుకుంటేనే రైతులకు రావాల్సిన పథకాలు, సౌకర్యాలు అందుతాయి. అయితే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వేలాది మంది రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకున్నప్పటికీ ఈ-కేవైసీ మాత్రం చేసుకోలేదు. అయితే ఈ- క్రాప్, ఈ-కేవైసీ నమోదు గడువు ముగిసిపోయింది.

ఈ-క్రాప్ చేయించుకున్న రైతులు 72,939 మంది..

నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 2.32 లక్షల ఎకరాల్లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు చేశారు. 68,503 మంది రైతులు చేయించుకోగా, 4,436 మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకోలేదు. కాగా ఈ- క్రాప్ నమోదు చేయించుకున్న రైతులకు స్థానిక వ్యవసాయ అధికారులు ఈ-కేవైసీపై అవగాహన కల్పించకపోవడంతో పాటు రైతుల నిర్లిప్తత ఇందుకు కారణంగా తెలుస్తోంది.

నియోజకవర్గంలో ఈ-పంట నమోదు, ఈ-కేవైసీ వివరాలు

మండలం	ఈ క్రాప్ నమోదు ఎకరాల్లో	నమోదు చేసుకున్న రైతులు	ఈకేవైసీ చేయించుకున్న రైతులు	చేయించుకోని రైతులు
పత్తికొండ	44,289	13,963	13,579	384
మద్దికెర	21,992	6,535	6,111	424
తుగ్గలి	61,972	19,681	18,333	1,348
వెల్దుర్తి	39,525	14,388	13,346	1,042
కృష్ణగిరి	65,187	18,372	17,134	1,238

ఈ-పంట, ఈ-కేవైసీతో ప్రయోజనాలు..

- పంటల బీమా వర్తిస్తుంది
- పంట రుణాలు తీసుకోవచ్చు
- సబ్సిడీలు, పంట నష్టపరిహారం అందుకోవచ్చు
- పండించిన ధాన్యాన్ని అమ్ముకోవచ్చు

95 శాతానికి పైగా పూర్తయింది



ఈ ఏడాది ఖరీఫ్‌నకు సంబంధించి ఈ-కేవైసీ 95 శాతం పైగా పూర్తయింది. దాదాపు 4వేల మందికి పైగా రైతులు చేయించుకోలేదు. రైతు సేవా కేంద్రాల ద్వారా సిబ్బంది పలుమార్లు ఈ-కేవైసీ చేయించుకోవాలని ప్రయత్నించినప్పటికీ రైతులు స్పందించలేదు. దీంతో కొంతమందికి ఈ-కేవైసీ జరగలేదు. ఈ-కేవైసీ చేయించుకోకపోతే వ్యవసాయ అనుబంధ పథకాలు వర్తించవు. ముఖ్యంగా పంటల బీమా వర్తించదు. వాతావరణ పరిస్థితులతో పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లుతోంది. ఇలాంటి సమయంలో బీమా వారికి అండగా నిలుస్తుంది. రైతులు వారి శ్రేయస్సుకు స్పందించిన అంశాలపై కొంత దృష్టి సారించాలి. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే బాగుంటుంది.

– మోహన్ విజయకుమార్, ఏడీఏ, పత్తికొండ

పశువుల వివరాలు తెలియజేయండి

మద్దికెర : మండలంలోని ఆయా గ్రామాల్లో పశువులపై రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేస్తుందని, పాడి రైతులు తమ పశువుల పూర్తి వివరాలు తెలియజేయాలని పశు వైద్యాధికారి కృష్ణానాయక్ గురువారం తెలిపారు. రైతులు ఎద్దులు, ఆవులు, ఎనుములు, మేకలు, గొర్రెలు గురించి తెలియజేయాలని సూచించారు. వివరాలు ఇవ్వడం వల్ల ప్రభుత్వం సబ్సిడీ పథకాలు మంజూరు చేసే అవకాశముందని చెప్పారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

తుగ్గలి : రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మారెల్లలో పార్టీ సమావేశం నిర్వహించి గ్రామ శాఖ కార్యదర్శిగా రంగస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. నిత్యావసరాల ధరల పెరుగుదలతో సామాన్యుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, సరైన ఆహారం తినలేక పోతున్నారన్నారు. రంగరాజు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం తనిఖీ

ఆస్పరి: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఎంపీడీఓ గీతావాణి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు వంద మంది వరకు ఆధార్ అప్‌డేట్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీచేసి పలు రికార్డులను పరిశీలించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల ప్రజలు ఆరోగ్యం ఉంటారన్నారు. తాగునీటి పైప్‌లైన్ లికేజీల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆధార్ అప్‌డేట్ చేసుకోని వారు ఆధార్ ప్రత్యేక సెంటర్లలో చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో తడి,పొడి చెత్తను సేకరించేందుకు డస్ట్‌బిన్ డబ్బాలు పంపామని, వాటిని ప్రతి ఇంటికి అందజేసి చెత్త సేకరించి సమీపంలో చెత్త సంపద కేంద్రాల్లో వేసి వర్మీకంపోస్టు తయారు చేయాలని సూచించారు. గతంలో ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసి పదోన్నతిపై డిప్యూటీ సీఈఓగా వెళ్లిన సుబ్బారెడ్డిని కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుహాసినమ్మ, ఈఓఆర్డీ రవికిషోర్ పాల్గొన్నారు.



డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న మండల పరిషత్ అధికారులు

మొండి బకాయిలు వసూలు చేస్తాం



సంతోష్‌కుమార్
ఏడీఈ, విద్యుత్ శాఖ

ఆలూరు: విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని మొండి బకాయిలను వసూలు చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక తయారు చేస్తున్నామని ఆలూరు విద్యుత్ శాఖ ఏడీఈ సంతోష్‌కుమార్ తెలిపారు. స్థానిక ఏడీఈ కార్యాలయంలో గురువారం ఆయన ఆలూరు, హాలహర్వి, చిప్పగిరి, హొళగుంద ఆస్పరి మండలాలకు సంబంధించిన కేటగిరి-1,2 కనెక్షన్ల వివరాలను ఏఈ,ఎల్ఐ, జేఎల్ఎం, బిల్ కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించిన పెండింగ్ బిల్లులు దాదాపుగా రూ.కోటికి పైగా ఉన్నట్లు తెలుస్తుందన్నారు. ఎంత కాలం నుంచి పెండింగ్ ఉన్నది పరిశీలించి నోటీసులు జారీ చేస్తామన్నారు. రైతులు, గృహవినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగించకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హొళగుంద మండలం కోకిలతోట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న 11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పనులను త్వరలో పూర్తియితే కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో కొరత ఉండదని చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక

కృష్ణగిరి: స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయానికి చెందిన 14 మంది విద్యార్థినులు వివిధ క్రీడల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ చైతన్య స్రవంతి తెలిపారు. ఈ నెల 18న కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో నెట్‌బాల్, అర్చరీ పోటీల్లో ప్రతిభ చూపి ఒకేసారి 14మంది రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. నెట్‌బాల్ అండర్ -14 విభాగంలో పల్లవిరెడ్డి, శ్రీలేఖ, అండర్-17 విభాగంలో అంజలి, మమత, అలాగే అర్చరీలో అండర్-14లో అనూష, మల్లేశ్వరి, అండర్-17లో స్వాతి, అనిత, అండర్-19లో మౌనిక, సంధ్య, కావ్యలు ఎంపికయ్యారన్నారు. అర్చరీలో ఎంపికైన విద్యార్థినులు నవంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు పార్వతిపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో, నవంబర్ 8,9 తేదీల్లో విశాఖపట్టణంలో జరిగే నెట్‌బాల్ రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని వివరించారు. విద్యార్థినులు, పీఈటీ సుప్రియను గురువారం ఉపాధ్యాయ బృందంతో కలిసి అభినందించారు.



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

నేటి నుంచి పశుగణన



ఆవులు

పత్తికొండ(తుగ్గలి) : పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి పశుగణన ప్రారంభం కానుంది. ప్రతి ఐదేళ్లకోసారి పశుగణన చేపడుతుండగా, ప్రస్తుతం ప్రారంభం కానున్న 21వ జాతీయ పశుగణన ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనసాగనుంది. ఇప్పటికే పశువైద్యాధికారులు, సిబ్బందికి పశుగణనకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. గేదెలు, ఆవులు, ఎద్దులు, మేకలు, గొర్రెలు, కుక్కలు, పందులు ఇలా అన్ని రకాల జంతువుల సంఖ్యను లెక్కించి ప్రభుత్వానికి నివేదించనున్నారు. పశుగణన తర్వాత పశుగణాభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిసారించే అవకాశం ఉంది.

ఆదోని డివిజన్‌లో 2018లో పశుగణన లెక్కలు ఇలా..
ఆవులు, ఎద్దులు, 1.22 లక్షలు
గేదెలు, 80 వేలు, గొర్రెలు, 6.63 లక్షలు

ఎన్యూమరేటర్లతో పశుగణన



శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న పశుగణన కోసం 107 మంది ఎన్యూమరేటర్లను నియమించాం. పశుసంవర్ధక శాఖలోని ఉద్యోగులే పశుగణన నిర్వహిస్తారు. లెక్కింపుపై వారికి శిక్షణ కూడా ఇచ్చాం. ఫిబ్రవరి నెలాఖరు వరకు నిరంతరాయంగా పశుగణన కొనసాగుతుంది.

– వెంకటరమణ, పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్, ఆదోని డివిజన్

సాగు నీటి సంఘాలకు త్వరలో ఎన్నికలు

తుగ్గలి : సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా నీటి సంఘాల ఓటర్ల జాబితా రూపొందించేందుకు సంబంధిత తహసీల్దార్ ఆథరైజ్డ్ అధికారిగా, నీటి పారుదల శాఖ తరపున అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారిని నియమించారు. మండలంలో నాలుగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందు కోసం ఓటరు జాబితా తయారీలో రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు నిమగ్నమయ్యారు. మైనర్ ఇరిగేషన్ కింద జొన్నగిరి చెరువు కింద 226 ఎకరాల ఆయకట్టు, పగిడిరాయి 108 ఎకరాలు, చెన్నంపల్లి 127 ఎకరాలు ఆయకట్టు ఉండగా, డిస్ట్రిబ్యూటరీ కింద బొందిమడుగుల రెవెన్యూ పరిధిలోని నునుసరాల్ల కాలవ కింద దాదాపు 900 ఎకరాలకు నీటి పారుదల ఉంది. వీటికి వచ్చేనెల 15 తర్వాత ఎన్నికల ప్రకటన వెలువడనుందని మైనర్ ఇరిగేషన్ మండల ఏఈ ధర్మేంద్ర తెలిపారు. వచ్చే నెల చివరి వారంలో ఎన్నికలు ఉంటాయని చెప్పారు.

సద్వినియోగం చేసుకోండి

కృష్ణగిరి: ప్రజలు సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గురువారం ఆయన సమాచార బోర్డును ఏర్పాటు చేసి ప్రజలు, రైతులతో సమావేశం ఏర్పాటు చేసి సమాచారహక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఏఈఓ అనిల్, రైతులు పాల్గొన్నారు.

పరామర్శ

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని మదార్‌పురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరామిరెడ్డి భార్య అనారోగ్యంతో కర్నూలు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గురువారం పరామర్శించారు. ఆరోగ్య విషయాలను తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరి కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని ఆధైర్యపడవద్దని చెప్పారు.

టమాట కిలో రూ.33



పత్తికొండ మార్కెట్ యార్డుకు వచ్చిన టమాట

పత్తికొండ(తుగ్గలి) : పత్తికొండ మార్కెట్‌యార్డులో గురువారం కిలో టమాట గరిష్ఠంగా రూ.33, కనిష్ఠంగా రూ.20, సరాసరిన రూ.28 ప్రకారం ధర పలికింది. వివిధ గ్రామాల నుంచి దిగుబడి మార్కెట్ తరలివస్తోంది. కాగా..ధర బాగుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్లార్తి దర్గాలో ప్రత్యేక పూజలు

హొళగుంద: ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాల్లో గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతో ఫాతెహాలు సమర్పించారు. సమాధులను దర్శించుకుని కానుకలు సమర్పించుకున్నారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాలకు, షిర్డీసాయిబాబా ఆలయంలో పూజలు చేశారు.

రీసర్వే సమస్యల పరిష్కారానికే గ్రామ సభ

చిప్పగిరి: రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూముల సమస్యలు పరిష్కరించడానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు పత్తికొండ ఆర్‌డీఓ భరత్ నాయక్ తెలిపారు.గురువారం మండలంలోని నంచర్లలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతుల భూముల సమస్యల వివిరాలు అడిగి తెలుసుకున్నారు. రీ సర్వేలో తలెత్తిన ప్రతి భూ సమస్యను తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. అర్జీలు ఇచ్చిన ప్రతి ఒక్కరూ అధికారులు ఇచ్చిన రసీదు జాగ్రత్తగా ఉంచుకోవాలని చెప్పారు. తహసీల్దార్ ఇజాజ్ అహమ్మద్, వీఆర్ఓ పెద్దన్న, పంచాయతీ కార్యదర్శి సురేంద్ర, నాయకులు శివలింగ,శివ పాల్గొన్నారు.

పత్తికొండ/తుగ్గలి : భూ సర్వే ప్రక్రియ పూర్తయిన గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభల్లో రైతుల నుంచి అర్జీలు వెల్లువెత్తాయి. గ్రామసభలు గురువారం ముగిశాయి. చివరి రోజు తుగ్గలిలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు, పత్తికొండ మండలం పెద్దహుల్తిలో రీసర్వే డీటీ బాలరాజునాయక్, ఆర్ఐ శ్రీనివాసులు హాజరై రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. పెద్దహుల్తిలో 72 , తుగ్గలిలో 326 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్లు గాదిలింగప్ప, సుధాకర్, వీఆర్వోలు రంగస్వామి, నవీద్‌పటేల్, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

మద్దికెర : గతంలో భూసర్వే చేసిన ఎం.అగ్రహారం, బురుజుల, హంప గ్రామాల్లో గురువారం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించగా 585 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని రైతులకు చెప్పారు.

ఆస్పరి: రీసర్వే భూ సమస్యలుంటే పరిష్కరిస్తామని తహసీల్దార్ శివశంకర్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. రీ సర్వే తహసీల్దార్ భీమేష్ పాల్గొన్నారు.



గ్రామ సభలో అర్జీలను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ భరత్‌నాయక్

వెల్దుర్తి(కృష్ణగిరి): సమగ్ర భూముల రీ సర్వేలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ సూచించారు. మండలంలోని నర్సాపురం గ్రామంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. మండల సర్వేయర్ హేమంత్ రెడ్డి పాల్గొన్నారు. కాగా శుక్రవారం కలుగొట్ల గ్రామంలో గ్రామసభ ఉంటుందని ఆయన తెలిపారు.

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో గురువారం డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.

హొళగుంద: మండలంలోని నాగరకణ్వీ గ్రామంలో హొన్నూరు సర్పంచ్ గర్రేడు శారద ఆధ్వర్యంలో తహసీల్దార్ సతీష్, ఆదోని డివిజనల్ సర్వే ఆఫీసర్ వేణుసూర్య గ్రామసభ నిర్వహించగా 46 మంది రైతులు తమ సమస్యలు పరిష్కరించాలని వినతులు అందజేశారు.

యురేనియం తవ్వకాలను అడ్డుకుంటాం



తవ్వకాలను అడ్డుకుంటామని నినాదాలు చేస్తున్న వివిధ గ్రామాల ప్రజలు

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో యురేనియం తవ్వకాలు చేపడితే అడ్డుకుంటామని, కొండ చుట్టూ ఉన్న గ్రామస్తులందరూ కలిసికట్టుతో తవ్వకాల నిలుపుదలకు పోరాడుతామని గ్రామాల ప్రజలు అన్నారు. గురువారం మండలంలోని కప్పట్రాళ్ల, చెల్లెలచెలిమల గ్రామ సర్పంచ్‌లు చెన్నమనాయుడు, మహేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు మల్లికార్జున, పి.కోటకొండ నాయకులు మల్లెపల్లి రంగడు తదితరులు కప్పట్రాళ్లలోని కొలుట్ల స్వామి ఆలయ ప్రాంతంలో విలేకరులతో మాట్లాడారు. జల వనరులశాఖ నుంచి 68 బోర్ల తవ్వకాలు చేపట్టడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు తెలిసిందన్నారు. తవ్వకాలు చేపడితే తీవ్ర అనారోగ్యాలకు గురికావాల్సి వస్తుందని, పచ్చని పొలాలు బీడు పారిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. హనుమంతరెడ్డి, ముచ్చు రామచంద్రుడు, రైతుసంఘం మండల నాయకుడు సూరి పాల్గొన్నారు.

• విద్యావ్యవస్థ నిర్వీర్యం

ఆలూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి విమర్శించారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గత ఐదేళ్లు విద్యార్థులకు అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందజేసి వారి విద్యకు ఆటంకం లేకుండా చూసిందని, అయితే ప్రస్తుతం అమ్మ ఒడి పథకం పేరు మార్చు తల్లివందనం అని ప్రకటించి చేతులు దులుపుకున్నారని, అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా పథకం అమలు చేయకపోవడంతో తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీఎం చంద్రబాబుకు మద్యం షాపుల ఏర్పాటుపై ఉన్న శ్రద్ధ హామీల అమలుపై లేదని మండిపడ్డారు. మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నా పట్టించుకోవడంలో విఫలమైందన్నారు.

• వీధి బల్బుల ఏర్పాటు

హాలహర్వి: మండలంలో గురువారం సర్పంచు మల్లికార్జున ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది విద్యుత్ స్తంభాలకు బల్బులు అమర్చారు. సర్పంచ్ మాట్లాడుతూ విద్యుత్ బల్బులు లేని, కాలిపోయిన చోట్ల కొత్త ఎల్ఈడీ బల్బులను అమరుస్తున్నట్లు చెప్పారు.

• అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలైనా అంగన్‌వాడీల సమస్యలపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ నోరు మెదపడం లేదని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ విమర్శించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 23న రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు సంబంధించి వేతనాల పెంపు విషయం ప్రస్తావించకపోవడంపై తీవ్ర మనస్థాపానికి గురయ్యామన్నారు. తమ ప్రభుత్వం వస్తే సమస్యలన్నీ పరిష్కరిస్తామని గతంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు కనీసం పట్టించుకోకపోగా పని భారం పెంచారని విమర్శించారు.

వర్షం.. పంటలకు నష్టం

హాలహర్వి: మండల కేంద్రంతో పాటు గూళ్యం, అర్ధగేరి, మెదేహాల్ తదితర గ్రామాల్లో గత బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. దీంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని సాగుచేసిన జొన్న పంట నేలవాలింది. జొన్నపంట పొట్టదశలో నేలవాలుతుండటంతో భారీగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు.

హొళగుంద: మండలంలోని నాగరకణ్వీ, మార్లమడికి, హొన్నూరు, కోగిలతోట, హొళగుంద తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రంతో పాటు కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షానికి వరి పంట నేలకొరిగింది. మండలంలో తుంగభద్ర దిగువ కాలువ కింద దాదాపు 5 వేల ఎకరాల్లో సాగు చేసిన పంట ప్రస్తుతం గింజ గట్టిపడే దశలో ఉంది. ఈ తరుణంలో తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షానికి, గాలికి పైరు నెలకొరిగి గింజలు నేల పాలవుతున్నాయి. ఎకరాకు దాదాపు రూ. 25 వేలు వరకు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేశామని పైరు నేలకొరగడం వల్ల గింజలు రాలి దిగుబడి తగ్గుతుందని రైతులు వాపోతున్నారు. అతివృష్టి వల్ల పత్తి, మిరప తదితర పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులు ఎల్లెల్సీ కింద సాగు చేసిన వరి పంటపై ఆశలు పెట్టుకున్నారు.



హాలహర్వి ప్రాంతంలో నేలవాలిన జొన్న పంట



నాగరకణ్వీలో వర్షానికి నెలకొరిగిన వరి పైరు

వర్షం నట్టేట ముంచింది



ఈ ఏడాది ఎన్నో ఆశలతో సాగు చేసిన వరి పంటతో బాగుపడతామని అనుకుంటే తమ ఆశను వర్షం నట్టేట ముంచింది. మంచి కంకితో కళకళలాడే పైరు వర్షం, గాలి కారణంగా నేలకొరిగి గింజలు రాలిపోయాయి. రెండెకరాలను కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. దాదాపు రూ.60 వేలు వరకు ఖర్చు చేశా. ఒక వైపు ముసురు, మరో వైపు వర్షంతో పైరు నేలకొరిగి గింజలు రాలిపోతున్నాయి. పంట పూర్తిగా చేతికి అందే పరిస్థితి కనబడటం లేదు. పెట్టుబడులు వస్తే చాలనుకుంటున్నాం. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– మునిపాలాక్షి, నాగరకణ్వీ